క్లుప్తంగా

నేటి నుంచి విఠోలిలో శిబిరం

తానూరు: ముధోల్ మండలం విఠోలి గ్రామంలో ఈనెల 14 నుంచి 23వ తేదీ వరకు భారతీయ బౌద్ధమహాసభ ఆధ్వర్యంలో మహిళా శిబిరం నిర్వహించనున్నట్లు భారతీయ బౌద్ధమహాసభ జిల్లా అధ్యక్షుడు రమేశ్ బాబు వాగ్మారే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా మండలాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని సూచించారు. ముంబైకి చెందిన భారతీయ బౌద్ధమహాసభ కేంద్రియ శిక్షక్ దప్తి దేవానంద్ రానున్నట్లు తెలిపారు. శిబిరంలో పాల్గొనేవారు బుధవారం మధ్యాహ్నం 12 గంటల్లోగా రావాలని ఆయన పేర్కొన్నారు.

'కోళ్లఫారం తొలగించాలి'



నిరసన తెలుపుతున్న పెద్దూర్ వాసులు

కడెం: మండలంలోని పెద్దూర్ 4వ కాలనీలో అక్రమంగా ఏర్పాటు చేసిన కోళ్లఫారంను తొలగించాలని పెద్దూర్‌వాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం కడెం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేశారు. రాజు, అరుణ అనే వ్యక్తులు ఏర్పాటు చేసిన కోళ్లఫారంతో కాలనీలో దుర్వాసన వస్తుందని ప్రజలు రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఫోన్ అప్పగించిన ఆర్టీసీ డ్రైవర్

నిర్మల్‌టౌన్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను ప్రయాణికుడికి అప్పగించి నిజాయతీ చాటుకున్నాడు నిర్మల్ ఆర్టీసీ డ్రైవర్. వివరాల్లోకి వెళితే.. సోమవారం నిర్మల్ బస్టాండ్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ఒంగోలుకు బస్సు బయలుదేరగా ఓ ప్రయాణికుడు వరంగల్‌లో ఎక్కాడు. బస్సులోనే ఫోన్ మర్చిపోయి విజయవాడలో దిగి వెళ్లిపోయాడు. కొద్దిసేపటికి ఫోన్ చూసుకున్న ప్రయాణికుడు బస్సు సర్వీస్ నెంబర్ ఆధారంగా వివరాలు తెలుసుకొని డ్రైవర్‌కు ఫోన్ చేసి విషయం చెప్పాడు. దీంతో బస్సులోనే ఫోన్ ఉందని చెప్పి..తిరుగు ప్రయాణంలో విజయవాడ బస్టాండ్‌లో ప్రయాణికుడికి ఫోన్‌ను డ్రైవర్ సుమన్ అప్పజెప్పాడు. ఈసందర్భంగా డ్రైవర్‌ను నిర్మల్ డిపో మేనేజర్ పండరి అభినందించారు.

గుడుంబా స్థావరాలపై దాడి



బెల్లం పానకం పారబోస్తున్న పోలీసులు

కడెం: ఎస్పీ జానకీషర్మిల ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని అల్లంపల్లి పంచాయతీ పరిధిలోని చింతగూడ గ్రామంలో గుడుంబా స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. సుమారు 200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎం.కృష్ణసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది ధన్‌రాజ్, దేవన్న, శ్రీనివాస్ ఉన్నారు.

దాబాలపై పోలీసుల దాడులు.. పలువురిపై కేసు



నిర్మల్‌రూరల్: తనిఖీ చేస్తున్న రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై లింబాద్రి

నిర్మల్‌రూరల్: నిర్మల్‌రూరల్ మండల పరిధిలోని పలు దాబాలపై మంగళవారం రాత్రి పోలీసులు దాడులు నిర్వహించారు. దాబాలలో మద్యం సేవించడానికి, అమ్మడానికి అనుమతి లేదన్నారు. నిర్మల్ శివార్లలోని పలు దాబాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని రెండు దాబాలపై కేసు నమోదు చేశారు. గ్రామాల్లో బహిరంగ మద్యం సేవిస్తున్న వారిని పట్టుకుని జరిమానా విధించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై లింబాద్రి పేర్కొన్నారు.

సారంగాపూర్: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న దాబాలపై మంగళవారం ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా అక్రమంగా మద్యం విక్రయిస్తూ దాబాల్లో సిట్టింగులను ప్రోత్సహిస్తున్న పలువురు యజమానులపై కేసులు నమోదు చేశారు. అనంతరం ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.

భూసమస్యల పరిష్కారానికే 'భూభారతి'

కుంటాల: రైతుల భూసమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం భూభారతి పథకాన్ని ప్రవేశపెట్టిందని తహసీల్దార్ కమల్‌సింగ్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మెదన్‌పూర్‌లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న రైతుల వద్దకు వెళ్లి క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు. డీటీ నరేశ్‌గౌడ్, ఆర్‌ఐలు అడెల్లు, రాజేశ్వర్, సిబ్బంది ఉన్నారు.

స్తంభాలు సరిచేయరూ..





నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని శివారు వ్యవసాయ భూముల్లో వంగిన కరెంటు స్తంభాలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. ఈదురుగాలులకు స్తంభాలు నేలకొరిగేలా ఉన్నాయి. నష్టం జరగకముందే విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి వంగిన స్తంభాలను సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

గుంతలతో అవస్థలు



భైంసారూరల్: మండలంలోని దేగాం–ఇలేగాం గ్రామాల మధ్య రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తుందని.. అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

'వాడి'లో డ్రైనేజీలేవి.?



భైంసారూరల్: మండలంలోని పోతల్‌గాం పంచాయతీ పరిధిలోని వాడి గ్రామంలో డ్రైనేజీలు లేకపోవడంతో మురుగునీరంతా రోడ్లపైనే ప్రవహిస్తుంది. దీంతో మురుగునీరు నిలిచిన చోట దోమలు వ్యాప్తి చెంది పిచ్చిమొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. రోగాల బారిన పడుతున్నామని.. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాలువలను నిర్మించి తమ ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

భూసారపరీక్షలకు తరుణమిదే..

- ఫలితాలతో నేల స్వభావం తెలుస్తుందంటున్న వ్యవసాయాధికారులు
- అవగాహన కల్పించాలంటున్న రైతులు



మాదాపూర్‌లో రైతు చేనులో మట్టిని సేకరిస్తున్న అధికారులు

లక్ష్మణచాంద: పంటలు బాగా పండాలంటే నేలలో నత్రజని, భాస్వరం తదితర పోషకాలు సమృద్ధిగా ఉండాలి. కొందరు రైతులు మూస పద్ధతిలో వ్యవసాయం చేస్తూ.. దిగుబడులు రాక నష్టపోతుంటారు. అధికంగా రసాయన ఎరువులను పంటలకు వినియోగిస్తే నేల చౌడుబారే ప్రమాదం ఉంది. అలా కాకుండా భూసార పరీక్షలు చేయించుకొని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేసి.. ఎరువులు వినియోగిస్తే మంచి దిగుబడులు పొందవచ్చు. ఒకవేళ భూమిలోని సారం దెబ్బతిన్నట్లు పరీక్షలో తేలితే అందుకు తగ్గట్లు రసాయన ఎరువులను వినియోగించుకొని లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

నేలలోని పోషకాలు ఎప్పుడూ ఒకేలా ఉండవు. పంటకు వేసే రసాయన ఎరువుల ఆధారంగా మారుతుంటాయి. విత్తనం విత్తడానికి ముందు నేల స్వభావం, మొక్కలకు కావాల్సిన పోషకాల మోతాదు తెలుసుకునేందుకు భూసార పరీక్షలు నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

మట్టిని సేకరించాలిలా..

- రైతు చేనంతా ఒకే రకంగా ఉన్నప్పుడు ఐదెకరాల విస్తీర్ణానికి ఒక మట్టి నమూనాను తీసుకోవాలి.
- మట్టి నమూనా సేకరించే ప్రదేశంలో గడ్డి, చెత్త, కలుపు మొక్కలు పూర్తిగా తొలగించాలి.
- పారను ఉపయోగించి మట్టిని 'వీ' ఆకారంలో 15 సెంటిమీటర్ల మేర గుంత తీసి ఒకే మందంతో మట్టి పార వచ్చేలా మట్టిని తీసుకోవాలి.
- మట్టిని సేకరించిన అనంతరం పాలిథిన్ పట్టా లేదా గట్టు మీద వేసి మట్టి గడ్డలు చిదిమి బాగా కలిపి చతురస్ర ఆకారంలో నాలుగు సమ భాగాలుగా విభజించాలి.
- ఇందులో నుంచి రెండు భాగాలు తొలగించి మిగిలిన రెండు భాగాల్లోంచి సుమారు అరకిలో మట్టిని సేకరించాలి.
- సేకరించిన మట్టిని క్లాత్‌తో గాని పాలిథిన్ కవర్‌లో రెతుల వివరాలు రాసి భూసార పరీక్ష కేంద్రాలకు పంపాలి.



ల్యాబ్‌లో పరీక్ష చేస్తున్న ఏఈవో ఉమామహేశ్వరి

అనువైన సమయమిదే..

యాసంగి పంటలు చేతికి రావడంతో నేలలోని మట్టి సేకరణకు ఇదే అనువైన సమయం అని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. సేకరించిన మట్టి నమూనాలను భూసార పరీక్ష కేంద్రాలకు పంపితే అక్కడ పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం వచ్చిన రిపోర్టు ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడలు పొందవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

మట్టి సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- సారవంతమైన, నిస్సారవంతమైన ప్రాంతం నుంచి మట్టిని సేకరించవద్దు.
- చెట్ల కింద, గట్ల పక్కన, కంచెల వద్ద, కాలిబాటల వద్ద మట్టిని సేకరించరాదు.
- నమూనాలు సేకరించే ప్రదేశంలో మట్టిలో ఆకులు,చెత్త ఉండకుండా చూసుకోవాలి.
- చౌడు భూముల్లో 0–15 సెంటిమీటర్లు, 15–30 సెంటిమీటర్లు లోతులో రెండు నమూనాలు సేకరించాలి.

రైతులకు మేలు..



ప్రభుత్వం రెండేళ్లకోసారి భూసార పరీక్షలు చేయిస్తే రైతులకు మేలు జరుగుతుంది. రైతుల చేనుల్లో భూసార పరీక్షలను ప్రభుత్వం ఉచితంగా చేయించాలి. భూసార పరీక్షలతో కలిగే ప్రయోజనాలను అధికారులు గ్రామాల్లోని రైతులకు అవగాహన కల్పించాలి.

– ముత్యం, రైతు, పీచర

ఏఈవోలను సంప్రదించాలి



అన్నదాతలు తమ పంట చేనుల్లో భూసార పరీక్షలు చేయించుకోవాలి. ఈ పరీక్షలతో భూ మిలో సూక్ష్మ మూలకాల లోపం ఉంటే తె లుస్తుంది. వీటి ఫలితాల ఆధారంగా పంటలకు ఎరువులు అందిస్తే మంచి దిగుబడులు పొందవచ్చు. నిర్మల్ జిల్లా కేంద్రంలో భూసార పరీక్ష కేంద్రం ఉంది. ఆసక్తి కల్గిన రైతులు భూసార పరీక్షల కోసం ఏఈవోలను సంప్రదించాలి.

– అంజిప్రసాద్, డీఏవో

స్పందించి.. పరిష్కరించారు



ట్యాంకుపై పైపు సరి చేస్తున్న సిబ్బంది



పైపులైన్‌కు మరమ్మతు చేసిన దృశ్యం

సాక్షి స్పందన

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి గ్రామంలో కొద్దిరోజులుగా ట్యాంకు నిండిన తర్వాత సిబ్బంది మోటార్ బంద్ చేయడం లేదు. దీంతో తాగునీరంతా రోడ్డుపై వృథాగా పారుతున్నాయి. దీనిపై ఈనెల 9న సాక్షిలో తాగునీటిని వృథా చేస్తున్నరు శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన పంచాయతీ అధికారులు మంగళవారం సాయంత్రం ట్యాంక్‌లోంచి నీరు వృథా పోకుండా చర్యలు చేపట్టారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పైపులైన్‌కు మరమ్మతులు

లక్ష్మణచాంద: మండలంలోని చామన్‌పెల్లి వద్ద రామాలయం వెనుక మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి నీరంతా వృథాగా పోతుంది. దీనిపై సాక్షిలో ఈనెల 10న ×భగీరథ×వృథా శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన మిషన్ భగీరథ అధికారులు మంగళవారం పైపులైన్ లీకేజీకి మరమ్మతులు నిర్వహించారు.

సమ్మెను జయప్రదం చేయాలి

ఖానాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని పీఆర్టీయూ భవన్‌లో ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. లేబర్ కోడ్ల రద్దును కోరుతూ ఈనెల 20న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో అన్నివర్గాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు గంగామణి, డివిజన్ కార్యదర్శి కమల, ఉపాధ్యక్షులు వినోద, మమత, స్వప్న తదితరులు ఉన్నారు.



ఖానాపూర్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కుంటాల: దేశవ్యాప్త సమ్మె మోడల్ నోటీసును కుంటాల వైద్యశాలలో వైద్యురాలు శృతి రెడ్డికి మండలంలోని ఆశవర్కర్లు అందజేశారు. తమకు నెలకు రూ.29వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆశావర్కర్ల సంఘం మండల కన్వీనర్ ఇంద్రమాల తదితరులు ఉన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలి

నర్సాపూర్(జి): రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకోవాలని ఏఈఓ రమ్య పేర్కొన్నారు. మండలంలోని బామ్ని(బి) గ్రామంలో మంగళవారం రైతుల వివరాలను నమోదు చేశారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు లింకేజీ మొబైల్ నంబర్ వెంట తీసుకురావాలని సూచించారు. ఆధార్ తరహాలో రైతులకు 11 అంకెల యూనిక్ కోడ్‌ను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు పేర్కొందన్నారు.

పెంబి: అగ్రిస్టాక్ తెలంగాణ ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఏఈవో రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం పెంబి రైతువేదికలో ఇటిక్యాల, తాటిగూడ, పస్పుల గ్రామాల రైతులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, మొబైల్ నంబర్ వివరాలతో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. దీంతో పీఎంకిసాన్ సమాన్‌నిధి సాయం, సాయిల్ హెల్త్ కార్డు, సీసీఐ, ఎఫ్‌సీఐ వంటి కేంద్రాల్లో ధాన్యం అమ్ముకునేందుకు, ఇతర కేంద్ర ప్రభుత్వాల పథకాలు పొందవచ్చని పేర్కొన్నారు. ఇందులో ఆయా గ్రామాల రైతులు ఉన్నారు.



బామ్ని(బి)లో వివరాలు నమోదు చేస్తున్న ఏఈఓ

ఎప్‌సెట్‌లో ప్రతిభ

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్రస్థాయిలో ఇంజినీరింగ్, అగ్రికల్చ ర్, ఫార్మసీ రంగాల్లో బ్యాచిలర్ డిగ్రీ ప్రవేశాల కోసం నిర్వహించిన ఫలితాలు ఇటీవల విడుదల కాగా జిల్లాకేంద్రానికి చెందిన విద్యార్థి దొడ సాయివేదాంశ్ ప్రతిభ కనబరిచాడు. మంజులాపూర్‌లో నివాసముండే లావణ్య–క్రాంతి కుమార్ దంపతుల కుమారుడైన సాయివేదాంశ్ ప్రాథమిక విద్యను స్థానిక విన్నర్స్ పాఠశాలలో, ఇంటర్ హైదరాబాదులో అభ్యసించాడు. చిన్ననాటినుంచే చదువులో ముందుండే వేదాంశ్ ఎప్‌సెట్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 530వ ర్యాంకు సాధించాడు. జేఈఈ మెయిన్స్ ఫలితాల్లోనూ 98.23 శాతం సాధించడం విశేషం.

మండల కార్యవర్గం ఎన్నిక

ఖానాపూర్: బీజేపీ మండల కార్యవర్గం మంగళవారం ఎన్నుకున్నట్లు ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, మండలాధ్యక్షుడు ఉపేందర్ తెలిపారు. జిల్లా అధ్యక్షుడు రితీష్ రాథోడ్ ఆదేశాలనుసారం బీజేపీ మండల ఉపాధ్యక్షులుగా పెట్టెం చంద్రశేఖర్, నరేందర్, రమేశ్, పవన్, ప్రధాన కార్యదర్శులుగా కంతి లింబాద్రి, బట్టు వరుణ్, కార్యదర్శులుగా కాలేరి రాజేందర్, దూస గంగరాజం, మక్కల భీ మన్న, రఘు, సదాశివ్‌తోపాటు 29 మంది నా యకులు, ఐదుగురు మహిళా సభ్యులతో 34 మందిని కార్యవర్గంగా ఎన్నుకున్నామని పేర్కొన్నారు.

తూకం వేగవంతం చేయండి

లోకేశ్వరం: వరి ధాన్యం తూకం వేగవంతం చేయాలని భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. మండలంలోని హవర్గ, అర్లి–గొడిసెరా గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా కోమల్‌రెడ్డి మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. రైతులు సైతం తప్ప, తాలు లేకుండా పంటను తీసుకురావాలని సూచించారు. 17 శాతం తేమ ఉంటే కొనుగోళ్లు చేపట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆర్డీవో వెంట ఏపీఎం మల్లేశ్, సీసీ శ్రీనివాస్, మహిళా సంఘం సభ్యులు ఉన్నారు.

నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం తహసీల్దార్ సోమ శ్రీనివాస్ తనిఖీ చేశారు. పంటలో తేమ శాతం పరిశీలించి.. కొనుగోళ్లను వేగవంతం చేయాలని సూచించారు. ఈసందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కొనుగోళ్లలో జాప్యం నెలకొనకుండా మిల్లుల ట్యాగింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని తహసీల్దార్ పేర్కొన్నారు. ఆర్ఐ నవతజ్యోతి, పీఏసీఎస్ డైరెక్టర్ ఆయిటి మహేశ్, సెంటర్ నిర్వాహకులు పద్మ, సాయి ఉన్నారు.



హవర్గలో పరిశీలిస్తున్న ఆర్డీవో కోమల్‌రెడ్డి

ప్రతీ ఇంట్లో ఇంకుడుగుంత

- ఏపీడీ నాగవర్ధన్

లోకేశ్వరం: గ్రామాల్లో ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత నిర్మించుకునేలా చర్యలు చేపట్టాలని ఏపీడీ నాగవర్ధన్.. సిబ్బందిని ఆదేశించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధిహామీ సిబ్బంది, గ్రామ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఏపీడీ మాట్లాడారు. ఉపాధిహామీ నిదులతో పశువుల పాక, గొర్రెల పాక, ఇంకుడుగుంతలు, చేపల చెరువులు నిర్మించుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. గ్రామాల్లో పాత దారులను సర్వే ద్వారా కూలీలతో పునరుద్ధరించాలని తెలిపారు. ఉపాధిహామీ పనుల్లో సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. అనంతరం మొహళ గ్రామ సమీపంలోని గొడిసెరా పాతూరి చెరువును పరిశీలించారు. ఉపాధి నిధులు మంజూరు చేసి చెరువుకట్టకు మరమ్మతులు చేపడతామని పేర్కొన్నారు. ఎంపీడీవో వెంకటరమేశ్, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, ఆనంద్‌రావు, చిన్నారావు, ఏపీవో రాజన్న పాల్గొన్నారు.



గొడిసెరా పాతూరు చెరువు వద్ద తెగిన కట్టను పరిశీలిస్తున్న ఏపీడీ నాగవర్ధన్

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

ఖానాపూర్: రాజీవ్ యువవికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న వారిలో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి జీవరత్నం పేర్కొన్నారు. మంగళవారం ఖానాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఆయన ఎంపీడీవో సునీత, ఎంపీవో రత్నాకర్‌రావు, మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ, ఆయా బ్యాంకుల మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్‌ను పరిశీలించి పాన్‌కార్డు ఇవ్వని వారి నుంచి పాన్ కార్డును తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలలోనే చేరాలి

ముధోల్: అన్ని సౌకర్యాలున్న ముధోల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే విద్యార్థులు చేరాలని ప్రిన్సిపాల్ బుచ్చయ్య అన్నారు. సోమవా రం మండలకేంద్రంలోని శివాలయం ప్రాంగణంలో కళాశాల పోస్టర్లు, బ్యానర్‌ను వీడీసీ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రచారం చేయాలని ప్రిన్సిపాల్.. వీడీసీ సభ్యులు, గ్రామస్తులను కో రారు. ముధోల్ వీడీసీ అధ్యక్షుడు విఠల్, కార్యదర్శి దశరథ్, ఉపాధ్యక్షుడు నాగేష్, కోశాధికారి జిదంవార్ వెంకటేశ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు ధర్మపురి సుదర్శన్, సాయన్న, కోరి పోతన్న, పతంకి కిషన్, అజీజ్, దిగంబర్, గ్రామస్తులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, సభ్యులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

భైంసాటౌన్: నియోజకవర్గంలోని పలువురు బాధితులకు ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ మేరకు పట్టణంలోని తన నివాసంలో 48 మంది బాధితులకు రూ.15లక్షల విలువైన చెక్కులు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడేవారికి చికిత్స నిమిత్తం ప్రభుత్వం అందించే సీఎం సహాయనిధి ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



భైంసాలో చెక్కులు అందుకున్నవారితో ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్

పరామర్శ

కుంటాల: మండలంలోని దౌనెల్లితండా గ్రామానికి చెందిన రాథోడ్ రమేష్, కుంటాలకు చెందిన అయిటి రాజు, చేపూరి చంద్రప్రకాష్ వివిధ కారణాలతో ఇటీవల మృతి చెందారు. మంగళవారం బాధిత కుటుంబాలను ఎమ్మెల్యే రామారావు పటేల్ పరామర్శించారు. మాజీ ఎంపీపీలు అప్క గజ్జారాం, జీవీ రమణారావు, బీజేపీ మండల కన్వీనర్ పసుల నవీన్, పండిత్ పటేల్, తాటి శివ, గజేందర్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.